


# జీఎంల బాధ్యతల స్వీకరణ

రెబ్బెన, ఆగస్టు 11: బెల్లంపల్లి ఏరియా జీఎంగా శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో అడిషనల్ జీఎంగా విధులు నిర్వహించి ఈయన, ఉద్యోగోన్నతిపై జీఎంగా ఇక్కడికి వచ్చారు. జీఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఖైరగూడ ఓసీపీలో పర్యటించారు. ఏరియాలోని ఉన్నతాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. అనంతరం ఏరియాలోని స్థితిగతులు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియా ఎస్వోటూజీఎంగా రాజమల్లు బాధ్యతలు స్వీకరించగా, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం నరేందర్, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, ఏరియా ఇంజినీర్ భీంరావ్‌జాడే, ఖైరగూడ ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, సివిల్(ఎస్ఈ) భాషా, పీఈ వీరన్న, ఎస్ఎస్వో వరప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గోలేటి శ్రీ కోదండ రామాలయంలో జీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జీఎం దంపతులను సనామనించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు మచ్చగిరి నరేందర్, వీరన్న, ఆలయ కమిటీ కోశాధికారి మీస చంద్రశేఖర్, సభ్యులు జగ్గయ్య, సొల్లు లక్ష్మి, మారం శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### మందమర్రి జీఎంగా దేవేందర్..

మందమర్రి, ఆగస్టు 11 : మందమర్రి జీఎంగా దేవేందర్ బాధ్యతలు స్వీకరించారు. రామగుండం ఏరియా నుంచి బదిలీపై రాగా, తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియాలోని అన్ని విభాగాల అధికారులు పరస్పర సహకారంతో నిర్ధేశిత లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తే ధ్యేయంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.

# కరాటేలోనూ రాణించాలి

మందమర్రి, ఆగస్టు 11: విద్యార్థులు చదువతో పాటు కరాటే పోటీల్లోనూ ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి సూచించారు. మందమర్రి పట్టణంలోని లక్ష్మీభవాణి గార్డెన్స్‌లో బీఎంఆర్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరై, పోటీలను ప్రారంభించారు. కరాటే ఆత్మరక్షణ విద్య అని, ఆపద సమయంలో ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిలర్ పోలం సత్యనారాయణ, గార్డెన్ యజమానులు రఘు, వేల్పుల కిరణ్, నాయకులు మంద తిరుమల్ రెడ్డి, బండి శంకర్, సీపెల్లి రాజలింగు, మండ భాస్కర్, భూపెల్లి కనకయ్య, రాజేశ్, సమ్మయ్య, రామంచ తిరుపతి, యునైటెడ్ ఆదిలాబాద్ కరాటే అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగలక్ష్మి, శ్రీనివాస్, వెంకటేశ్, మోహన్ పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రతిభ

శ్రీరాంపూర్, ఆగస్టు 11 : రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియా విద్యార్థులు ప్రతిభ చూపి, గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ పోచంపల్లి వెంకటేశ్ తెలిపారు. నిహారిక, జాష్మి, తన్వి, సుశాంత్, గౌతమ్, హిమానిక్షిత్, శ్రీచైత్ర గోల్డ్‌మెడల్స్ సాధించారని, హంసి, శ్రీనిధి, శివాంశ, శివ చరణ్, సాయి అక్షిత్, సింరిత, రిష్టిత, మనీష్ సిల్వర్ మెడల్స్ సాధించరని, ప్రవిణ్య, అజయ్, శ్రేయాస్ బ్రాంజ్ మెడల్‌స సాధించారని వివరించారు.

# నాన్నా.. నన్ను కాపాడు

- తండ్రితో మాట్లాడిన కాసేపటికే డెంగ్యూతో పదో తరగతి విద్యార్థిని మృతి
- కొన్ని గంటల వ్యవధిలోనే అదే గ్రామంలో మరొకరు..




జ్వరంతో మృతి చెందిన గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థిని పూజ(ఫైల్), కౌటాల : బోయర్ కాళిదాస్(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : నాన్న.. నన్ను ఎలాగైనా కాపాడు.. అంటూ తన తండ్రితో మాట్లాడిన కాసేపటికే పదో తరగతి విద్యార్థిని డెంగీతో మృతి చెందిన ఘటన తీవ్రంగా కలచివేసింది. ఉన్నత చదువులు చదివి ఆసరాగా నిలుస్తుందనుకున్న కూతురు తమ చేతుల్లోనే కన్నుమూయడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యం వహిస్తుందో శనివారం జరిగిన ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన జాడె కిషోర్-సురేఖ దంపతులకు ముగ్గురు సంతానం. కిషోర్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరి పెద్ద కూతురు పూజ (16) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వారం రోజులుగా జ్వరం వస్తుంది. పాఠశాల సిబ్బంది ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పూజ తండ్రి కిశోర్ పాఠశాలకు వెళ్లి ఇంటికి తీసుకువచ్చి చికిత్స చేయించాడు. జ్వరం తగ్గక పోవడంతో శుక్రవారం సాయంత్రం మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లోగల ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి మరింత విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందింది. 'నాన్న నన్ను ఎలాగైనా కాపాడు' అంటూ తండ్రి చేతిలో చేయివేసిన కొద్దిసేపటికే మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు దుఖ:సాగరంలో మునిగిపోయారు.

### పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం..

పూజ వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నా పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. తీవ్రమైన అస్వస్థతకు గురైన తర్వాతే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పటికే పూజ ఆరోగ్య పరిస్థితి చేయిదాటిపోవడంతో మృతి చెందింది. చదువుతో పాటు ఆటల్లోనూ చురుకుగా ఉండే పూజ జ్వరంతో మరణించడంతో తల్లిదండ్రులతోపాటు ఆ గ్రామాన్నే విషాదంలో ముంచింది. పేదరికం కారణంగా తమ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిస్తున్న తల్లిదండ్రులకు ఇలాంటి ఘటనలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విద్యార్థులు తరచుగా జ్వరాల బారిన పడుతున్నారు. వసతిగృహాల్లో తాత్కాలికంగా పనిచేస్తున్న ఏఎన్ఎంలతోనే జ్వరాలు వచ్చే విద్యార్థులకు చికిత్సలు చేయిస్తున్నారు. దీంతో విద్యార్థుల సరైన వైద్యం అందక ఆరోగ్యం క్షీణించి అస్వస్థతకు గురవుతున్నారు.

### అదే గ్రామంలో మరొక యువకుడు..

కౌటాల, ఆగస్టు 11 : గుండాయిపేట గ్రామానికి చెందిన బోయర్ కాళీదాస్ విష జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కాళీదాస్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. 4 రోజుల క్రితం కౌటాల, కాగజ్‌నగర్‌లోని దవాఖానల్లో చూపించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన విద్యార్థి జాడి పూజ శనివారం మృతి చెందగా, కొన్నిగంటల వ్యవధిలోనే యువకుడు మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుండాయిపేట గ్రామంలో ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో వైద్య సిబ్బంది హుటాహుటిని ఆ గ్రామానికి తరలింది. మృతుల కుటుంబాలను జిల్లా వైద్యాధికారి తుకారాం భట్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం నాయక్ ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.



కౌటాల : గుండాయిపేట గ్రామంలో జ్వరంతో మృతి చెందిన వారి వివరాలు తెలుసుకుంటున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎంహెచ్‌వో తుకారాం భట్

